వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 59 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు

- ఫార్మా ఉత్పత్తులపై వందశాతం టాక్స్
- భారతీయ ఔషధ పరిశ్రమలు లక్ష్యంగా సుంకాలు

**వాషింగ్టన్,**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు.

-మిగతా 3 లో



## మహిళలతో పెట్టుకుంటే అంతే సంగతులు

- కేటీఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి సీతక్క
- రవీంద్రభారతిలో బతుకమ్మ ఉత్సవాలకు హాజరు

**హైదరాబాద్**

మహిళలతో పెట్టుకున్న వారు ఎవరూ బాగుపడరని మంత్రి సీతక్క హెచ్చరించారు. సొంత ఇంట్లో ఆడపడచుకు న్యాయం చేయలేని వారు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం గాంధీ భవన్ లో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. సొంత ఇంటి ఆడబిడ్డను గోస పెడుతున్నారని.. మాజీ మంత్రి కేటీఆర్ కు ఇది తగునా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేపడుతున్న మహిళా సంక్షేమ కార్యక్రమాల్లో మహిళా కాంగ్రెస్ భాగస్వామ్యం కానుందని ఉద్ఘాటించారు. మహిళా కాంగ్రెస్‌ను -మిగతా 3 లో



## ఒక్కో మహిళ ఖాతాలో రూ.10 వేలు

- 75 లక్షల మంది మహిళా ఖాతాలో జమ
- బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం
- మహిళా రోజ్‌గార్‌కు ప్రధాని మోడీ ప్రారంభం

**న్యూఢిల్లీ/పాట్నా-**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి. తర్వాత వివిధ దశల్లో ఆ

-మిగతా 3 లో

# రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

### బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జిఓ జారీ

- కమిటీ సిఫారసులను ఆమోదించిన ప్రభుత్వం
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు
- ఉన్నతాధికారులతో ఎన్నికల సంఘం భేటీ






**హైదరాబాద్,**

తెలంగాణలో పల్లె, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు భారీగా రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ జి.ఓ నెం.9ను శుక్రవారం విడుదల చేసింది. ఈ రిజర్వేషన్ల ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. శనివారం ఉదయం ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, భద్రతా ఏర్పాట్లపై చర్చించనున్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బుసాని వెంకటేశ్వరరావు కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే

-మిగతా 3 లో



## ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ

- గొప్ప నేతలతో సమావేశమంటూ అమెరికా అధ్యక్షుడి పొగడ్తలు

**వాషింగ్టన్**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో కూడా పాల్గన్నారు. ఈరోజు గొప్ప నాయకులు వస్తున్నారు, వారితో ఇక్కడే సమావేశం జరుగుతుందంటూ సమావేశానికి ముందు ట్రంప్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారమే ట్రంప్, షరీఫ్ సమావేశమయ్యారు. అమెరికా, పాకిస్తాన్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో దాదాపు గంటా 20 నిముషాలు పాటు ఈ సమావేశం సాగింది. ఓవల్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశానికి మీడియాను దూరంగా వుంచారు. అమెరికా అధ్యక్షుడితో షరీఫ్ మొదటి సమావేశం ఇదే. 2019లో ఇమ్రాన్ ఖాన్ తర్వాత ఇంతవరకు పాక్ ప్రధాని ఎవరూ ఓవల్ ఆఫీసులో అడుగుపెట్టలేదు. ద్వైపాక్షిక

-మిగతా 3 లో



## తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం

- ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి బాధ్యతలు

**హైదరాబాద్**

తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఉన్న శివధర్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పని చేస్తున్నారు. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. హైదరాబాద్‌లో జన్మించిన శివధర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ (పెద్దతుండ్ల) గ్రామానికి చెందినవాడు. ప్రైమరీ స్కూల్ నుంచి ఉన్నత విద్య వరకు హైదరాబాద్‌లో -మిగతా 3 లో

## అప్రమత్తంగా ఉండాలి



- కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశం
- లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- భారీ వర్షాలపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ మహానగరంతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని లోతట్టు- ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతోపాటు- వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆ క్రమంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో -మిగతా 3 లో



## రష్యా ఆర్మీలో 27 మంది భారతీయులు

- భారత విదేశాంగ శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ,**

ప్రస్తుతం రష్యా సైనిక దళంలో 27 మంది భారతీయులు పనిచేస్తున్నారని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ విషయంలో తాము ఆ 27 మంది బాధిత కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉన్నామని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. రష్యా ఆర్మీలోకి భారతీయ పౌరులను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దని మరోసారి కోరుతున్నామని, దీని వల్ల వారి జీవితం, ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం జరుగుతున్న క్రమంలో కొన్ని రిక్రూట్‌మెంట్ సంస్థలు భారత దేశంలోని నిరుద్యోగులను మభ్యపెట్టి రష్యా సైన్యంలో చేర్చాయని ఆయన చెప్పారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

### తడిసి ముద్దయిన నగరం

- ఇబ్బందులు పడ్డ నగర వాసులు
- పటాన్‌చెరు వద్ద హైవేపై నిలిచిన ట్రాఫిక్
- కామారెడ్డి, మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్

**హైదరాబాద్, -26సెప్టెంబర్(నేటి భారత్)**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. శుక్రవారం కూడా భారీ వర్షం కురుస్తుండటంతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగం అప్రమత్తమైంది. ట్రాఫిక్ సమస్యలు, ప్రజల భద్రతా దృష్ట్యా వివిధ కంపెనీలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సూచించింది. పరిస్థితిని అర్థం చేసుకొని సహకరిం చాలని కోరింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మరోవైపు హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఛత్రినాక, తార్నాక, హబ్సిగూడ, నాచారం,

-మిగతా 3 లో



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

### బీఆర్ఎస్ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి



**హైదరాబాద్,**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని భారత రాష్ట్ర సమితి ప్రకటించింది. ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీంతో అభ్యర్థి పేరును పార్టీ వెల్లడించింది.అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. జూబ్లీహిల్స్ అభ్యర్థిగా భారత రాష్ట్ర సమితి ప్రకటించిన అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడారు. తనపై విశ్వాసంతో ఉపఎన్నికకు అభ్యర్థిగా పార్టీ అవకాశం -మిగతా 3 లో

# రాజు దాదా మృతదేహాన్ని భద్రపర్చండి..


## సుప్రీం కోర్టు ఆదేశాలు



**న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**
ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఈ నెల 22న జరిగిన ఎదురు కాల్పుల్లో మరణించిన తెలంగాణకు చెందిన మావోయిస్టు అగ్రనేత రామచంద్రా రెడ్డి అలియాస్ రాజు దాదా మృతదేహాన్ని తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భద్రపర్చాలని, దానిని దహనం కానీ, పూడ్చిపెట్టడం కానీ చేయవద్దని సుప్రీం కోర్టు శుక్రవారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. తన తండ్రిని చిత్రహింసలు పెట్టిన అనంతరం బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు హతమార్చారని రామచంద్రరెడ్డి కుమారుడు రాజా చంద్ర దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్‌లు దీపాంకర్ దత్తా, ఏజీ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.కాగా, ప్రభుత్వం తరపున హాజరైన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ పిటిషనర్ తండ్రిపై ఏడు రాష్ట్రాలో ఏడు కోట్ల రివార్డు ఉందని తెలిపారు. ఇప్పటికే ఇరువురి మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరిగిందని, దానిని వీడియో తీశారని, ఈ విషయంలో పోలీసులకు ఎలాంటి దురుద్దేశం లేదని చెప్పారు. పిటిషనర్ విజ్ఞప్తిపై తగు నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం హైకోర్టును ఆదేశించింది.

# ఉక్రెయిన్ వ్యూహంపై పుతిన్‌తో మోదీ చర్చలు!

## ట్రంప్ సుంకాల ఫలితం
## నాటో చీఫ్ ప్రకటన



**న్యూఢిల్లీ- ప్రజా స్వేచ్ఛ**
భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు రష్యాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూటే వ్యాఖ్యానించారు. న్యూయార్క్‌లో ఐక్య రాజ్య సమితి(యూఎన్) జనరల్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రూటే సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ ఉక్రెయిన్‌పై మీ వ్యూహమేమిటని భారత ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ని అడిగారని వెల్లడించారు అమెరికా అధ్యక్షుడు విధించిన సుంకాలు ఎదుర్కొంటున్న కారణంగానే ఉక్రెయిన్‌పై మీ వ్యూహం ఏమిటని పుతిన్‌ని మోదీ అడిగారని ఆయన అన్నారు. అయితే నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూటే చేసిన వ్యాఖ్యలను భారత్ శుక్రవారం తోసిపుచ్చింది. ఇది అవాస్తవం, నిరాధారం అని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. అటువంటి సంభాషణేదీ జరగలేదని స్పష్టం చేసిన విదేశీ వ్యవహారాల శాఖ నాటో సెక్రటరీ జనరల్ భవిష్యత్తులో జాగ్రత్తగా మాట్లాడాలని కోరింది.

# వాంగ్‌చుక్ అరెస్ట్..

## లద్దాఖ్‌లో ఆయన హింసను ప్రేరేపించారని కేసు నమోదు
## జాతీయ భద్రతా చట్టం కింద అదుపులోకి తీసుకున్న పోలీసులు

**లెహ్ - ప్రజా స్వేచ్ఛ**
లద్దాఖ్‌కి రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ చేపట్టిన శాంతియుత నిరసనలు హింసాత్మకంగా మారి నలుగురు మరణించగా, మరో 70 మందికి పైగా గాయపడిన నేపథ్యంలో నిరసనకారులను రెచ్చగొట్టారన్న ఆరోపణలపై వాతావరణ పరిరక్షణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ని శుక్రవారం జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద అరెస్టు చేశారు. వాంగ్‌చుక్‌ని జైలుకు తీసుకెళ్తారా లేక మరో చోటుకా అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. బుధవారం లెహ్‌లో ఘర్షణలు జరిగిన తర్వాత పరిస్థితిని అదుపు చేయడానికి కర్ఫ్యూ విధించారు. లద్దాఖ్‌కి రాష్ట్ర హోదా కల్పించాలని, లద్దాఖ్‌ని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండు చేస్తూ రెండు వారాల నిరాహార దీక్ష చేపట్టిన వాంగ్‌చుక్ నిరసన హింసాత్మకంగా మారడంతో తన దీక్షను అదేరోజు విరమించారు. లెహ్‌లో తలెత్తిన హింసాకాండకు వాంగ్‌చుక్ బాధ్యుడని మరుసటి రోజు ప్రభుత్వం



నిందించింది. వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రకటనలు, అధికారులు, లద్దాఖీ ప్రతినిధుల మధ్య ప్రస్తుతం జరుగుతున్న చర్చలపై కొన్ని రాజకీయ స్వార్థశక్తుల అసంతృప్తి నిరసనకారులను హింసకు ప్రేరేపించాయని ప్రభుత్వం పేర్కొంది. అరబ్ తిరుగుబాటు, నేపాల్ జెన్-జీని ప్రస్తావిస్తూ వాంగ్‌చుక్ చేసిన వ్యాఖ్యలతో నిరసనకారులు పట్టలేని ఆవేశంతో లెహ్‌లోని బీజేపీ కార్యాలయాన్ని దగ్ధం చేయడంతోపాటు ప్రభుత్వ వాహనాలకు నిప్పుపెట్టారని హోం శాఖ ఆరోపించింది.

**ఇది నియంతృత్వానికి పరాకాష్ఠ**
సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టును ప్రతిపక్షాలు శుక్రవారం తీవ్రంగా ఖండించాయి. నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలు పోతోందని, క్రూరమైన చట్టాలను ఉపయోగించడం ద్వారా కక్షసాధింపు అజెండాను పాటిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దేశంలో నియంతృత్వం పరాకాష్ఠకు చేరిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ విమర్శించారు. రాష్ట్ర హోదా కోసం లద్దాఖ్ ప్రజలు సాగిస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామని ఆయన ప్రకటించారు. వాంగ్‌చుక్ అరెస్టు దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేసిన జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా లద్దాఖ్‌కి ఇచ్చిన హామీల విషయంలో కేంద్రం ఎందుకు వెనక్కు తగ్గిందని ప్రశ్నించారు. వాంగ్‌చుక్‌ని అరెస్టు చేయడం ద్వారా అసమ్మతిని జాతి వ్యతిరేకంగా పరిగణిస్తామని ప్రభుత్వం నిరూపించుకుందని టీఎంసీ ఎంపీ సాగరికా ఘోష్ తెలిపారు.

# ఏటా 3,000 సూర్యుళ్లను మింగేస్తున్న కృష్ణబిలం!



**న్యూఢిల్లీ- ప్రజా స్వేచ్ఛ**
విశ్వం పరిణామం గురించి ప్రస్తుత అవగాహనను తోసిపుచ్చే నూతన కృష్ణబిలాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆర్ఏసీఎస్ జే0320-35 అనే ప్రకాశవంతమైన, శక్తిమంతమైన ఖగోళ వస్తువు ఊహింపశక్యం కానంత దూరంలో ఉన్నట్లు గమనించారు. ఇది కృష్ణ బిలం వృద్ధికి సంబంధించిన సంప్రదాయ సిద్ధాంతాలను సవాల్ చేస్తున్నదని పేర్కొన్నారు.ఈ ఖగోళ వస్తువు 12.8 బిలియన్ సంవత్సరాల నుంచి ప్రయాణిస్తున్నదని, దీని బరువు బిగ్ బ్యాంగ్ తర్వాత 920 మిలియన్ సంవత్సరాల్లో ఒక బిలియన్ సూర్యుళ్లతో సమానమైన బరువుకు పెరిగిందని తెలుస్తున్నది. దీని అసాధారణ వృద్ధి రేటు, ఎక్స్‌రేల్లో దీని ప్రకాశం శాస్త్రవేత్తలను విస్మయానికి గురి చేస్తున్నాయి ఆస్ట్రేలియన్ స్కేర్ కిలోమీటర్ ఎరే పాత్‌ఫైండర్ అత్యంత దూరంలో ఉన్న ప్రకాశవంతమైన వస్తువును గుర్తించడంతో ఆర్ఏసీఎస్ జే0320-35 అన్వేషణ కోసం ప్రయాణం మొదలైంది. దీనికి ప్రకాశవంతమైన, శక్తిమంతమైన ఖగోళ వస్తువు లక్షణాలు ఉన్నట్లు గమనించారు. వీటిలో అత్యంత బరువైన కృష్ణ బిలాలు ఉంటాయి. భారీ స్థాయిలో వాయువును ఇవి శోషించుకుంటాయి. 2023లో చంద్ర అబ్జర్వేటరీ ఎక్స్‌రే ద్వారా పరిశీలించినపుడు ఆర్ఏసీఎస్ జే0320-35 ప్రత్యేకత వెల్లడైంది. కృష్ణ బిలాలు వృద్ధి చెందే రేటు కన్నా 2.4 రెట్ల ఎక్కువ రేటుతో ఇది పెరుగుతున్నది. ఇది సంవత్సరానికి 300 నుంచి 3,000 సూర్యుళ్లతో సమానమైన మెటీరియల్‌ను ఇముడ్చుకుంటుంది.

# యోగి ఆదిత్యనాథ్‌ను పాతిపెడతం..

## 'ఐ లవ్ మహమ్మద్' ప్రోగ్రామ్‌లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**
మహారాష్ట్ర లోని బీడ్ జిల్లా లో జరిగిన 'ఐ లవ్ మహమ్మద్ కార్యక్రమంలో ఓ ముస్లిం నేత యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యోగి ఆదిత్యనాథ్‌ను పాతిపెడతామని బహిరంగ హెచ్చరిక చేశారు. 'ఐ లవ్ మహమ్మద్' ప్రోగ్రామ్‌లో ఓ మౌలానా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.యోగి ఆదిత్యనాథ్ మాజల్‌గావ్‌లోని ముస్తఫా మసీదుకు రావాలని ఆ మౌలానా సవాల్ చేశారు. ఆయన గనుక అక్కడికి వస్తే అక్కడే పాతిపెడతామని హెచ్చరించారు. ఈ బెదిరింపు వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అష్ఫాక్ నిసార్ షేక్‌గా గుర్తించారు. చాలా రోజుల క్రితమే ఆయన ఈ హెచ్చరికలు చేసినప్పటికీ తాజాగా ఆ వీడియో బయటికి వచ్చింది. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మౌలానాపై కఠిన చర్యలు తీసుకోవాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం మౌలానా మాట్లాడిన ఆ వీడియో విశ్వసనీయతను అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా మహమ్మద్ ప్రవక్త జయంత్యుత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో బారావఫత్ వేడుకలు జరిపారు.ఈ వేడుకల్లో 'ఐ లవ్ మహమ్మద్' ప్రచారం చేపట్టారు. ప్రవక్తపై తమ విశ్వాసాన్ని చాటుకుంటూ ముస్లిం యువకులు 'ఐ లవ్ మహమ్మద్' అని రాసి ఉన్న బ్యానర్‌లు, పోస్టర్‌లు ప్రదర్శించారు. అయితే హిందూ గ్రూపులు ఈ చర్యను వ్యతిరేకించాయి. రెచ్చగొట్టే కొత్త సంప్రదాయంగా దీన్ని విమర్శించాయి. పోలీసుల జోక్యంతో ఉద్రిక్తతలు తలెత్తాయి.

# అలహాబాద్ హైకోర్టులో రాహుల్‌గాంధీకి చుక్కెదురు

## సిక్కుల మతస్వేచ్ఛపై అమెరికాలో వ్యాఖ్యలు..

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
భారత్‌లో సిక్కుల మతస్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గత ఏడాది అమెరికా లో చేసిన వ్యాఖ్యలు ఆయనను చిక్కుల్లో పడేశాయి. ఆ వ్యాఖ్యలపై వారణాసిలోని ఎంపీ/ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ అలహాబాద్ హైకోర్టులో రివిజన్ పిటిషన్ వేశారు. అయితే హైకోర్టులో రాహుల్‌గాంధీకి చుక్కెదురైంది. ఆయన పిటిషన్‌ను హైకోర్టు ఇవాళ (శుక్రవారం) తోసిపుచ్చింది. దాంతో రాహుల్‌గాంధీ స్పెషల్ కోర్టు విచారణను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాహుల్‌గాంధీ 2024లో అమెరికాలో పర్యటించినప్పుడు.. భారతదేశంలో సిక్కులు స్వేచ్ఛగా



తమ మత విశ్వాసాలను పాటించలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. వాషింగ్టన్ డీసీ శివార్లలోని హెండన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో భారతీయ అమెరికన్లను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. 'సిక్కులు తలపాగాలు ధరించవచ్చా, కడియాలు ధరించవచ్చా, వారు గురుద్వారాకు వెళ్లగలుగుతున్నారా? అనే వాటిపైనే భారత్‌లో ఘర్షణలు జరుగుతున్నాయి' అని రాహుల్ చెప్పారు.అయితే రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. రాహుల్‌పై ఎఫ్ఐఆర్‌కు ఆదేశించాలని కోరుతూ వారణాసికి చెందిన నాగేశ్వర్ మిశ్రా అనే వ్యక్తి కోర్టుకు వెళ్లారు. కానీ ప్రసంగం అమెరికాలో చేసినందున తమ పరిధిలోకి రాదని పేర్కొంటూ ఆ పిటిషన్‌ను 2024 నవంబర్‌లో అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ తోసిపుచ్చారు. అయితే కోర్ట్ ఆఫ్ స్పెషల్ జడ్జి (ఎంపీ/ఎమ్మెల్యే) ఈ ఏడాది జూలై 21న మిశ్రా రివిజన్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. మిశ్రా పిటిషన్‌పై విచారణ జరుపాలని ఈ ఏడాది ఆగస్టులో అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ప్రత్యేక కోర్టు చర్య తప్పని, చట్టవిరుద్ధమని రాహుల్ తన రివిజన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఆ రివిజన్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.

# హమాస్ పని పట్టాల్సిందే..


## ఐక్యరాజ్యసమితిలో నెతన్యాహు



**ఐరాస, - ప్రజా స్వేచ్ఛ**
హమాస్‌కు వ్యతిరేకంగా గాజాలో ఇజ్రాయెల్ చేపట్టిన 'పనిని పూర్తి చేయాల్సిందేనని' ఆ దేశ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. గాజాలో వినాశకరమైన యుద్ధాన్ని ఆపడానికి నిరాకరించడంపై అంతర్జాతీయంగా ఒంటరి అవుతున్నప్పటికీ తాను వెనక్కి తగ్గేదే లేదని, తన వైఖరిలో మార్పు రాదని నెతన్యాహు శుక్రవారం ఐరాస సర్వ ప్రతినిధి సమావేశంలో తేల్చి చెప్పారు. ప్రసంగానికి ఆయన సిద్ధమవుతుండగానే, పలు దేశాల ప్రతినిధులు సమావేశం నుంచి వాకౌట్ చేయడం కన్పించింది.అయినప్పటికీ నెతన్యాహు తన ప్రసంగాన్ని ప్రారంభించగానే హాలులో అర్థం కాని అరుపులు ప్రతిధ్వనించాయి. అదే సమయంలో ఆయన ప్రసంగానికి ప్రోత్సాహకరంగా కొన్ని వర్గాల నుంచి చప్పట్లు మోగాయి. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పలుసార్లు ప్రశంసలు కురిపించారు. హమాస్ అంతానికి గాజాలో తాము ప్రారంభించిన పనిని పూర్తి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పారు.

# కడుపులో స్పూన్‌లు, టూత్‌బ్రష్‌లు!

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ నివాసి సచిన్ (35)కు వైద్యులు శస్త్ర చికిత్స చేసి, 29 స్పూన్‌లు, 19 టూత్‌బ్రష్‌లు, రెండు పెన్నులను తొలగించారు. దవాఖాన వర్గాల కథనం ప్రకారం, సచిన్ దురలవాట్లకు బానిసయ్యాడు. వాటిని మాన్పించాలనే ఉద్దేశంతో, ఆయనను డీఅడిక్షన్ సెంటర్‌లో



చేర్పించారు. ఆ సెంటర్‌లో ఆయనకు తగినంత ఆహారం ఇచ్చేవారు కాదు.తన ఇంటి నుంచి ఆహారం వచ్చినప్పటికీ, తన వరకు వచ్చేది కాదని ఆయన వాపోయాడు. దీంతో ఆయన స్పూన్‌లు, టూత్‌బ్రష్‌లు, పెన్నులను దొంగిలించి, ముక్కలు చేసి, గొంతులో కుక్కుకునేవాడు. నీళ్లు తాగి కడుపులోకి పంపించేవాడు. కొన్ని రోజుల తర్వాత ఆయనకు కడుపు నొప్పి వచ్చింది. ఎక్స్‌రే, సీటీ స్కాన్‌లో ఆయన వివిధ వస్తువులు మింగినట్టు తెలిసింది.

# మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు

(మొదటి తరువాయి)



అదేవిధంగా అప్‌హోస్టర్డ్ ఫర్నిచర్‌పై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ వానిటీలపై 50 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు- చెప్పారు. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ భద్రతతో పాటు- ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు- తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ ద్వారా ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయంతో భారతీయ ఫార్మా పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే ఎగుమతి అయ్యాయి. అంటే మొత్తం ఎగుతుల్లో ఇది 31 శాతం. ఇక అగ్రరాజ్యంలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15 శాతం మన దేశం నుంచి సరఫరా చేసినవే కావడం గమనార్హం.


# మహిళలతో పెట్టుకుంటే అంతే సంగతులు

(మొదటి తరువాయి)



మరింత బలోపేతం చేస్తామని చెప్పుకొచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాదని... మహిళలను బస్సు ఓనర్లను చేశామని ఉద్ఘాటించారు. అభయహస్తం నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం కాజేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. మరోవైపు... రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం రవీంద్రభారతిలో పువ్వుల బతుకమ్మ పాటను ఆవిష్కరించారు. తెలంగాణ పర్యాటక సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పువ్వుల బతుకమ్మ పాటను " V "S సంస్థ నిర్వాహకులు రూపొందించారు. సింగర్స్ గడ్డం సంతోష్, శ్రీనిధి పువ్వుల బతుకమ్మ పాటను ఆలపించగా.. నయని పావని నటించింది. ఈ సందర్భంగా సింగర్స్, నాయని పావనీని మంత్రి సీతక్క, కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరా శోభన్ సన్మానించారు.

# ఒక్కో మహిళ ఖాతాలో రూ.10 వేలు



(మొదటి తరువాయి)

సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశు పోషణ, వ్యవసాయం, -టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్క్రీన్‌పై లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తామని విపక్ష ఆర్జేడీపై నీతీశ్‌కుమార్ విమర్శలు చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం

(మొదటి తరువాయి)

ఆధారంగా 42% రిజర్వేషన్లు నిర్ణయించబడ్డాయి. ఆర్టికల్స్ 40, 243D, 243 తో పాటు డైరెక్టివ్ ప్రిన్సిపిల్స్ ప్రకారం ఈ రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే అసెంబ్లీలో ఈ బిల్లకు ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం అమలులోకి రాబోయే ఈ రిజర్వేషన్లతో తెలంగాణ దేశంలోనే తొలిసారి బీసీలకు పల్లె, పట్టణ స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రంగా నిలిచింది. ఈ నిర్ణయంతో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. రాబోయే ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో బీసీ వర్గాల ప్రాధాన్యం మరింత బలపడనుంది. అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, మార్చి 18, 2025న BC కోటాను 42%కు పెంచే బిల్లులు ఆమోదించారు. ఆగస్టు 31న మరో రెండు బిల్లులు ఆమోదించి, SC, ST, BC లకు 50% మించి రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదానికి పంపారు. కానీ అవి పెండింగ్ లో ఉన్నాయి. డెడికేటెడ్ BC కమిషన్ నివేదిక, కుల సర్వే ఆధారంగా 42% BC కోటా నిర్ణయించారు. ఈ కోటాలో మహిళలకు 50% సబ్-కోటా కూడా ఉంటుంది. జిల్లా కలెక్టర్లు రిజర్వేషన్ మ్యాట్రిక్స్‌ను సీల్డ్ కవర్లలో పంచాయతీ రాజ్ విభాగానికి సమర్పించారు. ఈ మ్యాట్రిక్స్ ప్రకారం, గ్రామ




పంచాయతీలు, మండల ప్రజా పరిషత్తులు , జిల్లా పరిషత్తులు లో కోటాలు నిర్ణయిస్తారు. జీవో విడుదలైనందున వెంటనే పంచాయతీ రాజ్ విభాగం కు సిఫార్సు చేస్తుంది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తుంది. ఎన్నికలు దశలవారీగా జరుగుతాయి. మొదటి దశలో జిల్లా పరిషత్తులు చైర్మన్‌లు (31), జెడ్పీటీసీలు లు (566), ఎంపీపీ ప్రెసిడెంట్లు (566), ఎంపిటీసీలు(5,773) ఎన్నికలు. రెండో దశలో గ్రామ పంచాయతీలు (13,000o) జరుగుతాయి. అయితే ఈ జీవో చెల్లుబాటుపై సందేహాలు ఉన్నాయి. సెప్టెంబర్ 24న తెలంగాణ హైకోర్టు, 42% బీసీ కోటాపై పిటిషన్‌ను తిరస్కరించింది. "జీవోజారీ కాలేదు, తొందరపడి పిటిషన్ వేశారు" అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఇప్పుడు జీవో జారీ అయినందుకు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఉందని కోర్టులో పిటిషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

# తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం

(మొదటి తరువాయి)

చదువుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసి తర్వాత సివిల్ సర్వీసెస్ క్లియర్ చేసి 1994లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌లోకి ప్రవేశించారు. ఏఎస్పీగా విశాఖపట్నంలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో పని చేశారు. గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్‌గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలందించారు. జిల్లాల ఎస్పీగా, డీఐజీ ఎస్‌ఐబీగా మావోయిస్టుల అణిచివేతలో కీలక పాత్ర పోషించారు. 2014-2016 మధ్యన తెలంగాణ రాష్ట్రానికి మొదటి ఇంటలిజెన్స్ చీఫ్‌గా పని చేశారు. 2016 నయీం ఎన్‌కౌంటర్‌లో ఆపరేషన్‌ను ప్లాన్ చేశారు.ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షక దళంలో భాగంగా యునైటెడ్ నేషన్స్ మిషన్ ఇన్ కొసావోలో కూడా శివధర్ రెడ్డి పని చేశారు. నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు ఎస్పీగా పని చేస్తున్న సమయంలో అనేక సెన్సేషనల్ కేసులను పర్యవేక్షించారు. 2007లో మక్కా మసీదులో బాంబు పేలుళ్లు, పోలీసు కాల్పులలో 14 మంది చనిపోయిన సంఘటన తర్వాత హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. అత్యంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన ఆ సమయంలో రాత్రి పగలు శ్రమించి, అన్ని వర్గాల ప్రజలలో ధైర్యం నింపి శాంతి భద్రతలను సమర్థవంతంగా కాపాడారు. విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో రోడ్ భద్రత కోసం ఆరైవ్ అలైవ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా, డైరెక్టర్‌గా పనిచేశారు. పర్సనల్ వింగ్‌లో ఐజి, అడిషనల్ డీజీగా సేవలందించారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంటెలిజెన్స్ చీఫ్‌గా మళ్ళీ శివధర్ రెడ్డి నియామకం అయ్యారు. గ్యాలంట్రీ మెడల్, పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్, ఐక్యరాజ్యసమితి మెడల్ సహా అనేక అవార్డులను శివధర్ రెడ్డి అందుకున్నారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

(మొదటి తరువాయి)



కూకట్‌పల్లి, జేఎన్టీయూ, నిజాంపేట్, ప్రగతినగర్, ఆల్విన్ కాలనీ, చార్మినార్, యూకత్‌పురా, ఓయూ క్యాంపస్, హైదర్‌నగర్, బాచుపల్లి, వివేకానంద నగర్, చార్మినార్, చాంద్రయణగుట్ట, బహదూర్‌పురా, లాలాపేట్, మల్లాపూర్, ఉప్పుగూడ, బార్కస్, బషీర్‌బాగ్, అబిడ్స్, కోఠి సహా పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. మియాపూర్ మంజీరా పైపులైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మైహోం మంగళ మార్గంలో రైల్వే అండర్ పాస్‌లోకి వరదనీరు చేరింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మియాపూర్ మంజీరా పైపు లైన్ రోడ్డు నుంచి కొండాపూర్ మై హోం మంగళ మార్గంలో రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి 65వ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ వద్ద నుంచి రుద్రారం వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంగారెడ్డి నుంచి ఇస్నాపూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వరద నీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మహ

# ట్రంప్‌తో పాక్ ప్రధాని భేటీ

(మొదటి తరువాయి)

సంబంధాలు, వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లతో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది.

# అప్రమత్తంగా ఉండాలి



ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. అలాగే నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, హైడ్రాతో పాటు- ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆ దిశగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలంటూ సీఎస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. అందులోభాగం ఉద్యోగులకు ఈ రోజు.. అంటే శుక్రవారం సాఫ్ట్ వేరు నిపుణులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలంటూ ఐటీ-కంపెనీలను ఇప్పటికే సూచించింది. అలాగే వివిధ ప్రాంతాల్లోని రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, జీహెచ్‌ఎంసీ బృందాలు రంగలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

(మొదటి తరువాయి)

కల్పించిందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తనకు ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానని సునీత పేర్కొన్నారు.

# 2,417 మంది భారతీయుల బహిష్కరణ..

## అమెరికా గణాంకాల విడుదల



**న్యూఢిల్లీ**

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 2400 మందికి పైగా భారతీయులను అమెరికా బహిష్కరించిందని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. ఆ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ భారత్ చట్ట విరుద్ధ వలసలకు వ్యతిరేకమని, చట్టబద్ధంగా ప్రజలు వలస వెళ్లే మార్గాలను ప్రోత్సహించాలనుకుంటోందని తెలిపారు.జనవరి నుంచి ఇప్పటివరకు 5,417 మంది భారతీయులు అమెరికా నుంచి బహిష్కరించబడ్డారని లేదా స్వదేశానికి పంపించివేయబడ్డారని ఆయన తెలిపారు.

## సంపాదకీయం

# రాజకీయ విలువలు లేని నేతలు !




రాజకీయమంటే పదవులు కావాలి. పదవి, హోదా ఉంటేనే ప్రజల గురించి మాట్లాడుతారు. ఎపిలో వైకాపానేత జగన్‌కు ఇది బాగా సరిపోతుంది. విపక్షనేత హోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని మొండికేశారు. చివరకు హైకోర్టు గడప తొక్కారు. ఐదేళ్లు సిఎంగా పనిచేసిన వ్యక్తికి నిబంధనలు తెలియకపోవడం, అసెంబ్లీకి రాకపోవడం సిగ్గుచేటు. తనకు విపక్ష పదవి కావాలని దేబురిస్తున్నారు. బయట ఉండి విమర్శలు చేస్తున్నారు. నిజానికి రాజకీయాల్లో రోజురోజుకూ విలువలు పడిపోతున్నాయి. సిద్దాంతాలు పక్కకు పోయాయి. ఎదుటి పార్టీని ఎలా దిబ్బతీయాలా అన్నదే ఇప్పుడు అన్నిపార్టీల ప్రథమ లక్ష్యంగా మారింది. అధికారంలో ఉంటే అక్రమాలకు పాల్పడడం, ఆస్తులు సంపాదించుకోవడం, ఓడితే ఎదుటి పార్టీని విమర్శించడం అలవాటు చేసుకున్నారు. బిఆర్‌ఎస్, వైకాపాలు ఇదే కోవలో ఉన్నాయి. తమ పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలపై మాత్రం మాట్లాడడంలేదు. ఇకపోతే కొందరు నేతలు అధికారం ఉన్న పార్టీలో ఉండడం అలవాటు చేసుకున్నారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడ చేరిపోతున్నారు. విపక్ష పార్టీలు కూడా సమర్థంగా పనిచేయడం లేదు. అధికార పార్టీని విమర్శించడం, ఐదేళ్ల తరవాత అదృష్టం ఉంటే మళ్లీ మనదే అధికారం అన్న ధోరణిలో రాజకీయాలు నెరపుతున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి.. పరస్పర విమర్శలతో పబ్బం గడుపుకునే పరిస్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. అనేక విషయాల్లో జగన్ అధికార టిడిపిపై విమర్శలు చేస్తే సరిపోతుందని ఎదురుదాడికి దిగుతున్నారు. తన హయాంలో జరిగిన పాపాలపై జగన్ ఏనాడూ విచారణ కోరుకోవడం లేదు. అందుకే రాజకీయాల్లో విలువలు లేవనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఇకపోతే తెలంగాణలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్, ఎపిలో ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో దివాళా తీయించిన జగన్ ఇప్పుడు ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారు. ఈ రెండు పార్టీల నేతలు తమ తప్పులను, అప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇప్పుడున్న ప్రభుత్వాలపై విరుచుకు పడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు, సిద్దాంత భావజాలాన్ని కలిగి ఉండడం లేదు. తమ రాజకీయ అవసరాన్ని ప్రజల అవసరంగా చిత్రీకరించి కొందరు పార్టీలు మారుతున్నారు. దీనికి ఎవరూ మినహా యింపు కాదు. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. సుప్రీం తీర్పు ఇచ్చి సూచనలు చేశాక, తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని పార్టీమారిన పదిమంది ఎమ్మెల్యేలు బుకాయిస్తున్నారు. ఎంతటి నేతలైనా అధికారపార్టీలో చేరడానికి వెరవడం లేదు. రాజకీయనిబద్దత పక్కకుపెడుతున్నారు. అధికారపార్టీ అయితే తమ పబ్బం గడుపుకోవచ్చు. అందులో చేరడానికి సవాలక్ష కారణాలు చూపాల్సిన అసవరం లేదు. రాజకీయాల్లో విలువలు లేవని, వ్యక్తులకు పార్టీల పట్ల విశ్వాసం కన్నా పదవులపైనే మోహం ఉందనడానికి తాజా రాజకీయాలే ఉదాహరణ. ఇలా ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఇకపోతే మోడీ పనితీరు నచ్చిందని, దేశానికి ఆయనే ఆశాజ్యోతి అని బిజెపి పార్టీలో చేరేముందు కొందరు ప్రవచానాలు వల్లిస్తున్నారు. గతంలో తెలంగానలో పలువురు బఆర్‌ఎస్‌లో చేరగా దానిని బిఆర్‌ఎస్ గర్వంగా చాటుకుంది. కానీ ఇప్పుడు తమ ఎమ్మెల్యేలు పార్టీని వీడేసరికి గగ్గోలు పెడుతోంది. ఇలా చేయడంలో కేవలం స్వార్థ రాజకీయాలు తప్ప మరోటి కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ పదవులు అనుభవించి, పార్టీ అధినేత అడుగలకు మడుగులొత్తిన వారు అధికారం కోల్పోగానే అధికారంలో ఉన్న పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.అనేక పదవులు అనుభవించి, రాజకీయంగా ఎదుగుదలకు కారణం అయిన పార్టీని, దాని అధినేతలను తిట్టాల్సినన్ని తిట్లు తిట్టి మరీ పార్టీలు మారుతున్నారు. ఇదంతా రాజకీయంగా తమ అవసరం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. రాజకీయ ఉనికి కోసం అనేక కారణాలు చూపుతున్నారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ ఎత్తులు వేస్తూ వీరిని అక్కున చేర్చుకుంటున్నారు. పార్టీ మారదల్చు కుంటే మారాలి. అంతేగానీ వీడుతున్న పార్టీపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని నేతలు గుర్తించాలి. రాజకీయ అవసరార్థం ఎప్పుడు ఏదైనా మాట్లాడే అలవాటు మన రాజకీయ నేతలకు ఉంది. చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు అవకాశం వస్తే ఢిల్లీ గద్దెను ఎక్కాలనే కుతూహలంతో ఉన్నవారు అనేకులు ఉన్నారు. ఏ పార్టీకి కూడా సిద్దాంతం లేదన్నది తాజా పరిణామాలను బట్టి గమనిం చాలి. అధికారమే అన్ని పార్టీల సిద్ధాంతం. అధికారం ఉంటేనే నేతలు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు. లేకుంటే అధికారం ఉన్న పార్టీలోకి జంప్ అవుతారు. ఇందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. రాష్ట్రం ఏదైనా, పార్టీ ఏదైనా అధికారం ఉంటే అదే తమ పార్టీ అన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఇది రాజకీయ పార్టీల పతనానికి దారితీస్తోంది. ప్రజల సమస్యలపై పోరాడే అవకాశం లేకుండా చేస్తోంది. రాజకీయనేతలు నిబద్దత కోల్పోతే ఎక్కువ కాలం నేతలుగా మనలేమని గుర్తిస్తే మంచిది. తెలంగాణలో ఓ పదిమంది విపక్ష బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ కోర్టుల చుట్టూ తిరుగుతోంది. చివరకు సుప్రీంకోర్టు బాల్‌ను స్పీకర్ కోర్టులో వేసింది. పార్టీ వీడిని వారికి స్పీకర్ నోటీసులు ఇచ్చి, విచారణ చేశారు. తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని అంటున్నారు. ఇక ఎపిలోనూ జగన్‌కు వీరవవిధేయులుగా ఉన్నవారు సైతం పార్టీని వీడుతు న్నారు. అధికారం పోవడంతో అధికార టిడిపి, జనసేనల్లో చేరుతున్నారు. వీరు కూడా సిద్దాంతాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా తెరమీదకు తీసుకుని వస్తున్నారు. నిజానికి ఫిరాయింపుల చట్టం పకడ్బందీగా లేకపోవడం, దానిని అమలు చేయాలన్న చిత్తశుద్ది పాలకుల్లో లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్లుగా పార్టీ ఫిరాయింపులు సాగుతున్నాయి. ఇందుకు అన్ని పార్టీలది ఒకటే సిద్దాంతం. దీనికి ఎక్కడో ఒకచోట తెరపడాలి. పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద రాజకీయాలపై ప్రజలు నిలదీయడం అలవాటు చేసుకోవాలి.

# హక్కుల కోసం గళమెత్తిన కార్మికులు

## పనిదినాలు తగ్గించి.. వేతనాలు పెంచాలని డిమాండ్
## దక్షిణ కొరియాలో భారీ ప్రదర్శన

**సియోల్ -- ప్రజా స్వేచ్ఛ**




అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు గళమెత్తారు. దక్షిణ కొరియా లోని సెంట్రల్ సియోల్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. పనిదినాలు, వేతనాలతో పాటు పలు అంశాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక మీడియా నివేదికల ప్రకారం కార్మికులకు 5 శాతం వేతన పెంపు, వారానికి నాలుగున్నర రోజుల పని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ.. టీ-షర్టులు ధరించిన కార్మికులు నినదించారు. సియోల్‌లోని చారిత్రాత్మక పౌర ప్లాజా అయిన గ్వాంగ్‌వామున్ స్క్వేర్ గుండా బ్యానర్లు, ప్లకార్డులను పట్టుకుని కవాతు చేశారు. తక్కువ పని వారాన్ని డిమాండ్ చేస్తూ పాడిన పాటలు మార్మోగాయి. చాలా మంది నిరసనకారులు 'జనరల్ స్ట్రైక్' అనే పదంతో ఎర్రటి హెడ్‌బ్యాండ్ లను ధరించి ప్రదర్శనలో కదంతొక్కారు. పడిపోతున్న జనన రేటును తిప్పికొట్టడానికి తక్కువ పని దినాలు చాలా కీలకంగా మారతాయని యూని యన్ నాయకులు వాదిస్తు న్నారు. దక్షిణ కొరియాలో స్త్రీల సంతానోత్పత్తి రేటు 0.75తో ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది. ప్రస్తుత పోకడలు కొనసాగితే 2072 నాటికి జనాభా దాదాపు మూడింట ఒక వంతు తగ్గుతుందని అంచనా. దక్షిణ కొరియా ఉత్పాదకత యూఎస్, జర్మనీ, నెదర్లాండ్స్ కంటే వెనుకబడి ఉంది. ఓఈసీడీ డేటా ప్రకారం 2023లో కొరియన్ కార్మికులు గంటకు జీడీపీలో 54.64 డాలర్ల మేర ఉత్పత్తి చేశారు, ఇది ఓఈసీడీ దేశాల్లో 10వ అత్యల్పం. యూఎస్‌లో 97.05 డాలర్లు, జర్మనీలో డాలర్లు 93.72 ఉన్నది. రికార్డు స్థాయిలో తక్కువ జనన రేటుతో ఇబ్బంది పడుతున్న జపాన్, పని ప్రదేశాల సౌలభ్యాన్ని కొంతమేర ప్రవేశపెట్టింది.

# ముగిసిన మిగ్-21 శకం

## చండీగఢ్‌లో తుది వీడ్కోలు
## 62 ఏండ్లు విశిష్ట సేవలు




**చండీగఢ్-- ప్రజా స్వేచ్ఛ**

భారత వైమానిక దళంలో సుదీర్ఘ కాలం(62 ఏండ్లు) సేవలందించిన మిగ్-21 విమానాల శకం శుక్రవారం ముగిసింది. చండీగఢ్‌లో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఎయిర్‌చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ మిగ్-21 బైసన్‌ను చివరిసారిగా నడిపారు. ప్రియా శర్మ మిగ్‌ను నడిపిన చివరి మహిళా పైలట్‌గా నిలిచారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్, సీడీఎస్ అనిల్ చౌహాన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాంథర్స్‌గా పిలిచే మిగ్-21 జెట్స్ ల్యాండింగ్ సందర్భంగా జల ఫిరంగులతో వందనం చేశారు. 1966-1980 మధ్య కాలంలో భారత్ వివిధ మోడళ్లలోని 872 మిగ్ విమానాలను కొనుగోలు చేసింది.పాకిస్థాన్‌తో 1965, 1977, 1999లో జరిగిన యుద్ధాల్లో, 2019లో జరిగిన బాలాకోట్ గగనతల దాడుల్లో ఈ విమానాలు కీలకపాత్ర పోషించాయి. 'ఆరు దశాబ్దాల పాటు సేవలు, లెక్కలేనన్ని సాహస గాథలు, దేశ గౌరవాన్ని ఆకాశంలో రెపరెపలాడించిన యుద్ధ గుర్రం' అంటూ ఐఏఎఫ్ ఎక్స్‌లో మిగ్-21 సేవలను ప్రశంసించింది. అయితే ఈ విమానాల సుదీర్ఘ సేవా చరిత్ర అనేక ప్రమాదాల వల్ల దెబ్బతింది. ఈ పాత కాలం నాటి విమానాల భద్రతపై ఇటీవలి దశాబ్దాలలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

# కెనడాలో బెయిల్‌పై విడుదలైన ఖలిస్థానీ టెర్రరిస్ట్..

## -అజిత్ దోవల్‌కు బెదిరింపులు

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**




ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ గోసల్ కెనడా దేశంలో మూడు రోజుల క్రితం అరెస్టైన విషయం తెలిసిందే. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను ఒట్టావాలో అదుపులోకి తీసుకున్నారు. అయితే, అరెస్టైన నాలుగు రోజుల్లోనే అతడు విడుదలయ్యాడు. బెయిల్‌పై ఒంటారియో సెంట్రల్ ఈస్ట్ కరెక్షనల్ సెంటర్ నుంచి బయటకు వచ్చాడు. జైలు నుంచి బయటకు వచ్చిన గోసల్.. తాను ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నానని వ్యాఖ్యానించాడు. ఖలిస్థాన్ కోసం పన్నూన్ చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇస్తానని ప్రకటించాడు. 'ఢిల్లీ బనేగా ఖలిస్తాన్' అంటూ మీడియాతో అన్నాడు.గోసల్ విడుదలైన అనంతరం సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్ సింగ్ పన్నూన్ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడ్డాడు. 'అజిత్ దోవల్.. మీరు కెనడా, అమెరికా లేదా ఏదైనా యూరోపియన్ దేశానికి ఎందుకు రావట్లేదు. వచ్చి నన్ను అరెస్ట్ చేయడానికి, లేదా అదుపులోకి తీసుకోడానికి ఎందుకు ప్రయత్నించకూడదు. మీ రాకోసం ఎదురుచూస్తున్నాను' అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇంద్రజీత్ సింగ్ గోసల్ .. గుర్‌పత్వంత్ సింగ్ పన్నూన్‌కు అత్యంత సన్నిహితుడు. 2023 నుంచి గోసల్ కెనడాలో ఎస్ఎఫ్‌జే కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. గత ఏడాది నవంబర్‌లోనూ కెనడా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గ్రేటర్ టొరంటో ఏరియాలోని ఒక హిందూ ఆలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రమేయం ఉందని ఆ సమయంలో ఆరోపణలు వచ్చాయి. తర్వాత షరతులతో కూడిన బెయిల్ మంజూరు కావడంతో బయటికి వచ్చాడు.

# 5 నుంచి 9 ఏళ్ల వయసున్న పిల్లల్లో ట్రైగ్లిజరైడ్స్ అధికం

**న్యూఢిల్లీ -- ప్రజా స్వేచ్ఛ**




దేశంలో 5 నుంచి 9 ఏళ్ల మధ్య వయసున్న మూడోవంతు పిల్లల్లో ట్రైగ్లిజరైడ్స్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు. జమ్మూకశ్మీర్, వెస్ట్ బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల పిల్లల్లో ఇది మరీ ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం రిపోర్టులో వెల్లడైంది. బెంగాల్‌లోని 67 శాతం, సిక్కింలోని 64 శాతం, నాగాలాండ్‌లోని 55 శాతం, అస్సాంలోని 57 శాతం, జమ్మూకశ్మీర్‌లోని 50 శాతం పిల్లల్లో అత్యధిక స్థాయిలో ట్రైగ్లిజరాయిడ్స్ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.రక్తంలో ట్రైగ్లిజరాయిడ్స్ అధికంగా ఉంటే, భవిష్యత్తులో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. కేరళ, మహారాష్ట్ర పిల్లల్లో మాత్రం అత్యల్పంగా ట్రైగ్లిజరైడ్స్ ఉన్నట్లు తేల్చారు. కేరళలో 16.6 శాతం, మహారాష్ట్రలో 19.1 శాతంగా ఉంది. స్టాటిస్‌టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వశాఖ రిలీజ్ చేసిన చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025 బుక్‌లో ఈ రిపోర్టు ఇచ్చారు. చండీఘడ్‌లో జరిగిన సీఎంసీఎస్ఎస్ఓ కార్యక్రమంలో ఈ రిపోర్టును రిలీజ్ చేశారు. ప్రభుత్వ మంత్రిత్వ కార్యాలయాలు, శాఖలు సేకరించిన డేటా ద్వారా అంచనా వేశారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019-21, నేషనల్ న్యూట్రిషన్ సర్వే 2016-18 రిపోర్టులను ప్రచురించిన తరహాలో డేటాను సేకరించారు. ప్రి మాచ్యూరిటీ, తక్కువ బరువు ఉన్న పిల్లల్లో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. అఫిక్సియా(ఆక్సిజన్ అందకపోవడం), గాయాలు, న్యూమోనియా వల్ల కూడా శిశువుల్లో మరణాలు చోటుచేసుకుంటున్నాయి.దేశంలో ఉన్న టీనేజర్లలో అయిదు శాతం మంది హైపర్‌టెన్సివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఢిల్లీలో అత్యధికంగా హైపర్ పిల్లల సంఖ్య 10 శాతంగా ఉంది. ఆ తర్వాత యూపీ(8.6), మణిపూర్(8.3), చత్తీస్‌ఘడ్(7 శాతం) రాష్ట్రాలు ఉన్నాయి. భారత్‌లో ఉన్న 16 శాతం మంది టీనేజీ యువతలో ట్రైగ్లిజరైడ్స్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

# బీహార్‌లో తేజ్ ప్రతాప్ కొత్త పార్టీ!

**పాట్నా:-- ప్రజా స్వేచ్ఛ**




బీహార్‌లో సుదీర్ఘ పోరాటం కోసం జన్ శక్తి జనతా దళ్ పేరిట కొత్త పార్టీని ప్రారంభించినట్టు ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ శుక్రవారం ప్రకటించారు. ఈ పార్టీకి తాను జాతీయ అధ్యక్షుడినని, బ్లాక్ బోర్డ్ పార్టీ ఎన్నికల గుర్తు అని ఎక్స్‌లో పోస్టర్‌ను పంచుకున్నారు. అయి దు చిన్న పార్టీలు తన నేతృత్వంలో పని చేయనున్నాయని ఆగస్టులో తేజ్ ప్రతాప్ ప్రకటించారు.లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య తండ్రి, సోదరులతో విభేదించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. కానీ అందుకు తేజస్వియాదవ్ అంగీకరించలేదని తెలిసింది.

# స్థానికానికి సై

- 42 శాతం బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసిన రాష్ట్రఎన్నికల సంఘం
- నేడో, రేపో నోటిఫికేషన్
- నేడు సీఎస్‌తో పాటు ఆయా శాఖల






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తంచేసింది. సుదీర్ఘకాలంగా ఈ ఎన్నికలపై డోలాయమానంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఎన్నికలకు వెళ్లాలనే నిర్ణయించింది. దానికి అనుగుణంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. దీనితో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటర్ల జాబితాలు మొదలు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా సమాచారం ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై జీవో నెంబర్ 09ని ప్రభుత్వ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతలపై సమీక్షించేందుకు డీజీపీతో రాష్ట్ర ఎన్నికల సంఘం భేటీ అయ్యింది. మరోవైపు క్షేత్రస్థాయిలో అధికారులకు శిక్షణా కార్యక్రమాలు పూర్తయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి(6), ఆర్టికల్ 243 టి(6) ప్రకారం సీట్ల రిజర్వేషన్ కోసం నిబంధనలు రూపొందించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ బుసాని వెంకటేశ్వరరావు ప్రత్యేక కమిషన్, తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల(ఎస్ఈఈఈపీసీ) సర్వేలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతంతో పోలిస్తే రిజర్వేషన్లు తక్కువగా ఉన్నాయని ఎత్తిచూపుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని వన్‌మెన్ కమిషన్ నివేదిక సమర్పించిన విషయాన్ని ప్రస్తావిం చారు. బీసీ జనాభాకు తగ్గట్టుగా రాజకీయ ప్రాతినిధ్యం లేనందున వారి సంక్షేమం, అభివృద్ధి కోణంలో స్థానిక సంస్థల్లో ప్రస్తుత రిజర్వేషన్ స్థాయిని 42 శాతానికి పెంచాలని కమిషన్ చేసిన సిఫారసును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొన్నారు. ”తెలంగాణ వెనుకబడిన తరగతులు (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్లు) బిల్లు, 2025 (ఎల్.ఎ.బిల్. నం.04 ఆఫ్ 2025)”ను అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ, శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదించాయ ని ప్రస్తావించారు. జీవోకు అనుగుణంగా నడుచుకోవాల ని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీ రిజర్వేషన్లను ఎస్ఈఈఈపీసీ–2024 ప్రకారం ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రాథమికంగా ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లలోనూ మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించారు.

**నేడు ఉన్నతస్థాయి సమావేశం**
స్థానిక ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని శాఖలతో ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 11 గంటలకు దీన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ, పంచాయతీ రాజ్‌శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొంటారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చిస్తారు. అదేరోజు సాయంత్రంగానీ, ఆదివారం గానీ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు మీడియా సమావేశాన్ని నిర్వహించి నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసే అవకాశముంది.

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ పదవులకు రిజర్వేషన్లు ఖరారు**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వర్తింపజేస్తూ జీవో నెంబర్ 41ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ పదవులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటున్నట్టు, ఎస్ఈఈఈపీసీ నివేదిక ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేయనున్నట్టు వెల్లడించింది. అదే సమయంలో అన్ని రిజర్వేషన్ల కోటాలోనూ మహిళలకు 50 శాతం వర్తింపజేయనున్నది. జిల్లా పరిషత్ చైర్మెన్/చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ రిజర్వేషన్ల కేటాయింపు నిర్ణయాన్ని కలెక్టర్లకు అప్పగించింది.

**ఈసీతో డీజీపీ భేటీ**
రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదినితో డీజీపీ డాక్టర్ జితేందర్ శుక్రవారం భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య స్థానిక ఎన్నికలకు సబంధించి భద్రతా ఏర్పాట్లపైనే ప్రధాన చర్చ నడిచినట్టు విశ్వసనీయ సమాచారం. ఎన్నికలు ఎప్పుడు జరిగినా శాంతిభద్రతలను పరిరక్షించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని డీజీపీ తెలిపారు. రాజకీయంగా సున్నితంగా ఉండే పలు ప్రాంతాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, ఎన్నికల సమయంలో పోలీసుల పాత్రపై ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. మావోయిస్టుల ప్రభావం రాష్ట్రంపై లేదనీ, సున్నిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని ఎన్నికల సంఘానికి డీజీపీ జితేందర్ హామీ ఇచ్చినట్టు తెలిసింది.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై నరేష్ కుమార్




**గోపాల్ పేట్ , ప్రజా స్వేచ్ఛ**
మండలంలోని పలు గ్రామాల ప్రజలు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, రైతులు పొలాల దగ్గరకి వెళ్ళినప్పుడు కరెంట్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని,భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు,వైర్లకు తాకకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు .భారీ వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,వంకలు,చెరువులు వద్ద వరద ప్రవాహం అధికంగా ఉన్న చోట వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు.వర్షపు నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున,పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు.పిల్లలు,యువకులు చెరువులు,కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి,ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు.శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదు,వర్షం సమయంలో చెట్ల కింద ఉండటం వల్ల పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంది అందువల్ల చెట్లకింద ఉండరాదు,చేపలు పట్టుటకు,పశువులను మేపడానికి బయటకి వెళ్లకూడని ఆయన ప్రజల కి సూచించారు.

## బీటి రోడ్డు శంకుస్థాపన చేసినఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**మోతె ప్రజా స్వేచ్ఛ**
మోతె మండలం అన్నారి గూడెంలో అన్నారిగుడెం నుండి కరక్కయలగూడెం వరకు 3కోట్ల 30లక్షలతో bt రోడ్డుకు శంకుస్థాపన చేసిన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తు ప్రతి గ్రామం అభివృద్ధి చేయడమే తమలక్ష్యం మానరు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి యం గురువా రెడ్డి మాజీ జడ్పీటీసీ పూలరావ్ మాజీ ఎంపీపీ ఆశ నూకల మధుసుధన్ రెడ్డి ముదిరెడ్డి మధుసుధాన్ రెడ్డి మేకల గురుకృష్ణ మామిడివెంకటేశ్వర్లు సీత శ్రీను గణేష్ తదితరులు పాల్గొన్నారు

## విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

– విద్యారంగ అభివృద్ధికి కట్టుబడిన ప్రభుత్వం– వైరా ఎమ్మెల్యే



**కారేపల్లి , ప్రజా స్వేచ్ఛ**
విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంతర్‌రెడ్డి విద్యరంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ విద్యను ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యార్థుల ఉన్నతికి అధ్యాపకుల కృషితో పాటు, తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. తమ పిల్లల ప్రవర్తన, చదువుల విషయంలో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రగతి కార్డులను తల్లిదండ్రులకు అందించారు. ఈ,సంధర్భంగా ప్రిన్సిపాల్ విజయకుమారి కారేపల్లి కళాశాలకు అదనంగా ఆరుతరగతి గదులు నిర్మాణానికి నిధులు మంజూరుకు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గదులనిర్మాణానికి ఎస్టిమేషన్ వేయించాలని సూచించారు. అనంతరం కళాశాలలో బతుకమ్మ అడారు. ఈకార్యక్రమంలో సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై బైరు గోపి, అధ్యాపకులు సుధారాణి, వేణు, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, వనిత, పార్థసారథి, యాకయ్య, లక్ష్మినారాయణ, రమా, కాసిం, రాంబాబు, బాబురావు, షాజిదా, కవిత, కలష్ణవేణి, యాకూబ్ పాషా, సుధీర్, సిబ్బంది మదార్, ఖాసిం, వెంకటేశ్వరరావు, కావేరి, సరస్వతి, ఖదర్ తదితరులు పాల్గొన్నారు.

**చాకలి ఐలమ్మ జయంతి**
కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా అమె చిత్రపటానికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. చాకలి ఐలమ్మ పోరాట స్పూర్తిని కొనియాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బానోత్ దేవ్లానాయక్, అడ్డగోడ ఐలయ్య, మేదరి వీరప్రతాఫ్, దారావత్ భద్రునాయక్, ఎండీ.యాకూబ్‌అలీ, బానోత్ హీరాలాల్, గుగులోత్ హర్షా, ఆదెర్ల రాములు, మాలోత్ బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
విద్యుత్ తీగలు కరెంటు స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లకు దూరంగా ఉండాలి



**వికారాబాద్ జిల్లా ,ప్రజా స్వేచ్ఛ**
వికారాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా చూస్తున్న వర్షాలకు వికారాబాద్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును మరియు వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాలను బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించినారు. వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ఈ సందర్భంగా ఆయన వికారాబాద్ జిల్లా ప్రజలకు కీలకమైన సూచనలు చేశారు.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి.వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు వెళ్లకూడదు. వర్షాలు తగ్గే వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి.అత్యంత అవసరం ఉండి ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, వాగులు దాటే సాహసం చేయరాదు.రైతులు వ్యవసాయ పనుల కోసం బావులు, పొలాల్లోకి వెళ్ళినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. శిథిలావస్థలో ఉన్న వంతెనలపై, వరద ప్రవాహం ఉన్న రోడ్లపై ప్రయాణం చేయవద్దు.వాగులు, నదులు, ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.అకాల వర్షాల వల్ల దాదాపు అన్ని రకాల పంటలు పాడైపోయాయి. కాబట్టి ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, నష్టపోయిన రైతులను సత్వరమే ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలి. వికారాబాద్ జిల్లా బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు.

# రాష్ట్ర కొత్త డీజీపీ శివధర్‌రెడ్డి

## అక్టోబర్ 1న బాధ్యతల స్వీకరణ

ప్రజా స్వేచ్ఛ ....
తెలంగాణ పోలీస్ డైరెక్టర్ జనరల్(డీజీపీ)గా రాష్ట్ర నిఘా విభాగం డీజీపీ బత్తు ల శివధర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా ఆయనకు పోలీస్‌కోఆర్డినేషన్, డీజీపీ (ఫుల్ అడిషనల్ చార్జ్)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి శివధర్‌రెడ్డి ఉత్తర్వులను సచివాలయంలో అందుకున్నారు. ఆయనకు పోలీస్ శాఖలో అపార అనుభవంతో పాటు చిత్తశుద్ధి, నిజాయితీ, సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరున్నది. శివధర్‌రెడ్డి 1994లో ఐపీఎస్ సర్వీసుకు ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలిఖాన్ గ్రామంలో జన్మించిన శివధర్‌రెడ్డి హైదరాబాద్‌లోనే ఎల్‌ఎల్‌బీ వరకు విద్యాభ్యాసం చేశారు. కొంత కాలం పాటు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. తర్వాత సివిల్ సర్వీస్ పరీక్ష రాసిన శివధర్‌రెడ్డి ఐపీఎస్ అధికారిగా పోలీస్ శాఖకు ఎంపికయ్యారు. మొదట విశాఖ జిల్లా అనకాపల్లి, చింతపల్లి ఏఎస్పీగా పోలీసు శాఖలో విధులను ప్రారంభించిన ఆయన తర్వాత గ్రేహౌండ్స్ ఏఎస్పీగా, అనంతరం నెల్లూరు, గుంటూరు, నల్లగొండ, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ నగర ట్రాఫిక్ డీసీపీగా, దక్షిణ మండలం డీసీపీగా విధులను నిర్వహించి సమర్థుడైన అధికారిగా పేరు పొందారు.ఆ తర్వాత ఇంటర్నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యాన కొసావో శాంతి పరిరక్షక దళంలో పని చేసిన ఆయన.. ఆ తర్వాత యాంటీ నక్సలైట్ నిఘా విభాగం (ఎస్ఐబీ) డీఐజీగా విధి నిర్వహణ సాగించారు. అనంతరం ఏసీబీ డైరెక్టర్‌గా పని చేసిన ఆయన 2012 నుంచి 2014 వరకు వైజాగ్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2014 జూన్ 2న తెలంగాణ కొత్త రాష్ట్రంగా అవతరించాక రాష్ట్ర తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ సమయంలోనే గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగింది. అనంతరం కొద్ది రోజుల తర్వాత కొన్ని కారణాలతో ప్రభుత్వం ఆయనను అక్కడి నుంచి ఆకస్మికంగా బదిలీ చేసింది. తెలంగాణకు బలమైన మద్దతుదారుడిగా పేరు పొందిన శివధర్‌రెడ్డిని ప్రభుత్వం ఆకస్మికంగా



బదిలీ చేయటం ఆ సమయంలో చర్చనీయాంశంగా మారింది.ఆ తర్వాత రైల్వే, రోడ్డు భద్రత విభాగం ఐజీగా నియమితులయ్యారు. అక్కడి నుంచి డీజీపీ కార్యాలయంలో కోఆర్డినేషన్ ఐజీ, అదనపు డీజీగా దాదాపు ఎనిమిదేండ్ల పాటు పని చేసిన ఆయన.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తిరిగి నియమితులయ్యారు. అక్కడే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెూదాకు పదోన్నతి పొందిన శివధర్‌రెడ్డి.. తాజాగా రాష్ట్ర పోలీస్ బాస్ డీజీపీగా నియమితులయ్యారు. వివిధ హెూదాల్లో ఆయన పని చేస్తూ ముఖ్యంగా సీపీఐ(మావోయిస్టు) కార్యకలాపాల అణచివేతలోనూ, అజ్ఞాతంలో ఉన్న అనేక మంది తీవ్రవాదులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావటంలోనూ ప్రత్యేక కృషి సల్పారు. ఐఎస్ఐ ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో సైతం శివధర్‌రెడ్డి కీలక పాత్రను నిర్వహించారు.

### పలు పతకాలు అందుకున్న శివధర్‌రెడ్డి

విధినిర్వహణలో చేసిన కృషికిగానూ ఆయనకు రాష్ట్రపతి పోలీసు పతకం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్(పీపీఎం), ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)తో పాటు అంతర్జాతీయ శాంతి పోలీస్ పతకం అందాయి. పాస్‌పోర్ట్‌ల వెరిఫికేషన్‌లో దేశంలోనే అగ్రగామిగా నిలిచినందుకు విదేశాంగ శాఖ నుంచి ప్రశంసా పతకం వంటివి కూడా శివధర్‌రెడ్డి అందుకున్నారు. విధి నిర్వహణలో డాంబికాన్ని ప్రదర్శించకుండా సామాన్య ప్రజల సమస్యలను సైతం ఓపికతో విని పరిష్కరించే మనస్తత్వం కలిగిన శివధర్‌రెడ్డి తాను పని చేసిన ప్రతి ప్రాంతంలోనూ అటు ప్రజలు, ఇటు తన సబార్డినేట్‌ల నుంచి మన్ననలను పొందారు. ముఖ్యంగా ఇంటెలిజెన్స్ విభాగం, శాంతి భద్రతల విభాగంలో అపారమైన అనుభవాన్ని గడించిన శివధర్‌రెడ్డి పలు సంచలన కేసుల దర్యాప్తులోనూ మంచి ప్రావీణ్యాన్ని చూపించారనే పేరున్నది.

### 30న ప్రస్తుత డీజీపీ పదవీ విరమణ

ఈనెల 30న ప్రస్తుత డీజీపీ జితేందర్ పదవీ విరమణ చేస్తున్నారు. అక్టోబర్ 1న శివధర్‌రెడ్డి డీజీపీ పగ్గాలను స్వీకరిస్తారని తెలిసింది. ఆయనకు మరో ఏడాది కాలం పాటు సర్వీసు ఉన్నది. కాగా ఈయన కంటే సీనియర్, 1990 బ్యాచ్‌కు చెందిన నగర పోలీస్ కమిషనర్ సి.వి ఆనంద్‌కు కాకుండా శివధర్‌రెడ్డికి డీజీపీ పగ్గాలు ప్రభుత్వం అప్పగించటం పోలీసు వర్గాల చర్చనీయాంశమైంది. కాగా అక్టోబర్ చివరినాటికి రాష్ట్ర డీజీపీ ఎంపికకు సంబంధించి యూపీఎస్సీ నుంచి తాము పంపించిన సీనియారిటీ



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# భర్తీ పూర్‌లో వీరనారి ఐలమ్మ విగ్రహావిష్కరణ



జగిత్యాల, ప్రజా స్వేచ్ఛ ....
ఇబ్రహీంపట్నం మండలం భర్తీ పూర్ గ్రామంలో కోరుట నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, సాధారణ రైతాంగ కూలీగా ప్రారంభమైన ఐలమ్మ అన్యాయాలను, జమీందారీ దౌర్జన్యాలను, వలస పాలకుల అణచివేతను ఎదుర్కొని పోరాటానికి ముందడుగు వేసిన ధైర్యవంతురాలని గుర్తు చేసుకున్నారు. ఆమె ధైర్యం వల్ల అనేక మంది కూలీలు, రైతులు పోరాటంలో చేరారని, మహిళలు కూడా సమాజ మార్పుకు ముందుండగలరని చాటి చెప్పారు. ఐలమ్మ వీరగాథ ఈరోజు కూడా మనకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.ఈ చారిత్రాత్మక సందర్భంలో భర్తీ పూర్ గ్రామ ప్రజలు, బి ఆర్ ఎస్ నాయకులు కంతం రమేష్ నోముల లక్ష్మారెడ్డి రజక సంఘ సభ్యులు బి ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మల్దకల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సుధాకర్

జోగులాంబ గద్వాల జిలా
ప్రజా స్వేచ్ఛ ...



శుక్రవారం మల్దకల్ మండలం పరిధిలోని బూడిదపాడు స్టేజ్ సమీపంలో వర్షంలో పొడవైన చెట్టు దారికి అడ్డుగా పడడంతో రవాణా పరంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు అయ్యాయి.ఇదే రోడ్డు మార్గాన విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న మల్దకల్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సుధాకర్ గమనించి చెట్టుకొమ్మను తొలగించడంతో ప్రయాణికుల రవాణా సౌకర్యానికి సుగమం అయ్యింది.ఇదే రోడ్డు మార్గాన వెళుతున్న ప్రయాణికులు కానిస్టేబుల్ సుధాకర్ ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.వాస్తవమే కదా ఎక్కడైనా సమస్య ఉన్న సమయంలో ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఆశించకుండా మన వంతుగా సమస్యకు పరిష్కారం అయ్యే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేసినట్లయితే ఎవరికి ఎలాంటి సమస్య ఉండదని కానిస్టేబుల్ సుధాకర్ నిరూపించడం ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతం.

# నా కల సాకారం అయింది

## ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ ,ప్రజా స్వేచ్ఛ
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంద్రమ్మ ఇల్లును ఎమ్మెల్యే బాలునాయక్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఇంటి యజమాని గీత సురేష్ కి ఎమ్మెల్యే శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆత్మగౌరవం కనిపించిందని ఊరు ఊరంతా అభిమాన తోరణం కట్టి ఇంద్రమ్మ ఇళ్ల పండుగకు నన్ను ఆహ్వానించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. దేవుడు ఇచ్చిన ఈ అవకాశంతో నా మనసు ఉప్పొంగి పోతుందని ఈ జన్మకు ఇంతకంటే మధుర క్షణాలు లేవు పే దల ఆత్మ గౌరవానికి సొంతింటి కల నెరవేర్చ అవకాశం రావడం నా అదృష్టం నా జన్మ ధన్యమైందని ఎమ్మెల్యే అన్నారు.






రాష్ట్రం ఏర్పాడే నాటికి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో పేదలకు ఏడాదికి లక్ష ఇండ్లు కట్టించిన పదేళ్లలో పది లక్షల ఇళ్ళు దక్కేవని ఎమ్మెల్యే అన్నారు. ఎన్ని సంవత్సరాలు బ్రతికామన్నది ముఖ్యం కాదని ఏం సాధించాము ఎంతమంది అభిమానాన్ని సంపాదించుకున్నామన్నది మన జీవితంలో ఒక్క గొప్ప విశేషమని ఎమ్మెల్యే అన్నారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రుల ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున ఈ పథకము ముందుకు కొన సాగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ ప్రమేమీ లేకుండా కమిషన్ల తావు లేకుండా ఇద్దరమ్మఇళ్లను మంజూరు చేస్తున్నమని ఇంకా ఎవరికైనా రానివాళ్లు ఉంటే రెండవ దఫా ఖచ్చితంగా వాళ్లకు ఇంద్రమ్మ ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి ఎంపీడీవో డానియల్ కొర్ర రామ్ సింగ్ నాయక్ మండల నాయకులు మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీపీలు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానా పత్రిక

వెస్ట్ మారేద్పల్లి ,ప్రజా స్వేచ్ఛ



తెలంగాణ సంస్కృతిని తెలిపేలా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను అలయ్ బలయ్ చైర్ పర్సన్ బండారు విజయలక్ష్మి కలిసి అక్టోబర్ 3 వ తేదీన నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆహ్వానం అందజేశారు. ప్రస్తుత హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రారంభించిన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఆమె కుమార్తె బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్నారు. తెలంగాణ కళలు, వంటకాలు, సాంప్రదాయాలను తెలిజెప్పే విధంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తుండటం పట్ల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆమెను అభినందించారు, ఈ కార్యక్రమంలో అమీర్పేట్ మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి డివిజన్ అధ్యక్షులు ముత్యాల హనుమంతురావు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, కూతురు నరసింహ, కట్టా బలరాం, వనం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# “తెలంగాణ సంస్కృతి సంప్రదాయ ప్రతీక - బతుకమ్మ “

ప్రజా స్వేచ్ఛ
తెలుగు భాషా చైతన్య సమితి, శ్రీ త్యాగరాయ గానసభ,నక్క వెంకటమ్మ యాదవ్,నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషనల్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్ర వారం నాడు శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ కవి, విశ్లేషకులు రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షతన దసరా సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బతుకమ్మ తెలంగాణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలకు
ప్రతీక అని , దాని పవిత్రతను కాపాడవలసిన బాధ్యత కవులు,రచయితల పైన ఉందని రామకృష్ణ చంద్రమౌళి అన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య మసన్న చిన్నప్ప , ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మాట్లాడుతూ , దసరా పండుగ రాజ్యాన్ని రక్షించే క్షత్రియులు తమ బాధ్యత గుర్తు చేసుకొని మంచి పరిపాలన అందించేందుకు సూచనచేసే పెద్ద పండగ అని,




వేదాలు , ఉపనిషత్తుల ప్రకారం ఈ పండుగ ఆధ్యాత్మికను సంతరించుకుని ఉందని అన్నారు. డా. నమోజు బాలాచారి,తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి మాట్లాడుతూ , తెలంగాణ ప్రభుత్వం తరఫున సాకిత్య కార్యక్రమాలు నిర్వహిస్తు కవులకు ,కళాకారుల ప్రతిభను గుర్తించి వారికి పురస్కారాలు అందిస్తున్నామని చెప్పారు.తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు పి. బడే సాబ్ సభ సమన్వయకర్త మాట్లాడుతూ , గత పుష్కర కాలంగా మారుమూల ప్రాంతాలలో ఉన్న ఎందరో కవులని,కళాకారుల ప్రతిభను గుర్తించి వారిని గౌరవించి కళామ తల్లికి




సేవ చేస్తున్నామని అన్నారు.సభ ప్రారంభానికి ముందు డా. రాధా కుసుమ నిర్వహణలో విజయ దశమి అంశం పై కవి సమ్మేళనం జఅరిగింది. దసరా సమ్మేళనం సందర్భంగా వివిధ రంగాలలో ప్రముఖులైన రామకృష్ణ చంద్రమౌళి, పాలడుగు సరోజినీ దేవి, పరిమి వేంకట సత్య మూర్తి, మేడిశెట్టి వెంకటేశ్వర్లు,ఉషా రాణి లకు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు.నక్క శ్రీనివాస యాదవ్,గంటా మనోహర్ రెడ్డి, పి. వి.పి అంజనీ కుమారి, చీదెళ్ళ సీతా లక్ష్మీ ,అర్థం చంద్ర ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత ను కలిసిన తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా ఇంచార్జీ సంజయ్ రెడ్డి


జగిత్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ



జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లతను కలెక్టరేట్ లో తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ఇంచార్జీ ఆకుల సంజయ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లతతో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 గురించి చర్చించినట్టు తెలిపారు.

# బిజినెస్

## నేటి నుంచి బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు




**న్యూఢిల్లీ,**
ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఎట్టకేలకు తన 4జీ సేవలు అందించడానికి సిద్ధమైంది. ఈ నెల 27 నుంచి తన 4జీ సేవలు 'స్వదేశీ 4జీ నెట్‌వర్క్'ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన టెక్నాలజీని ఇందుకు వినియోగించనున్నారు.క్లౌడ్ ఆధారిత సేవలను 5జీ సేవలుగా అప్‌గ్రేడ్ చేసుకునేందుకు వీలుంటుందని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్యా సింధియా తెలిపారు. దేశవ్యాప్తంగా 98 వేల సైట్లలో ఈ నూతన సేవలు అందుబాటులోకి రానున్నట్టు ఆయన వెల్లడించారు.

## ఫార్మా రాజధానిగా హైదరాబాద్

### బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఎమ్‌డి



**హైదరాబాద్**
భారత ఫార్మా రంగ రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఇండియా ఎమ్‌డి వికాశ్ అగర్వాల్ అన్నారు. హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వినియోగదారుల పరిధి పెరుగుతున్న నేపథ్యంలో బిసిజి తన సేవలను పలు నగరాలకు విస్తరిస్తోందని, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై తర్వాత ఇప్పుడు హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ఫార్మా ఉత్పత్తులలో మూడింటిలో ఒక వంతు, ఎగుమతులలో ఐదింటిలో ఒక్క వాటా కలిగి ఉందన్నారు. తెలంగాణ జిఎస్‌డిపిలో తయారీ రంగం 19.5 శాతం వాటా కలిగి ఉందన్నారు. ఇది జాతీయ సగటు 17.7 శాతం కంటే ఎక్కువన్నారు.

## సూచీలకు టారిఫ్ సెగ.. ఫార్మా, ఐటీ షేర్లలో భారీగా అమ్మకాలు

### ఒక్క శాతం వరకు నష్టపోయిన సూచీలు

**ముంబై,**
దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి బాంబు పేల్చడంతో సూచీలు కుదేలయ్యాయి. బ్రాండెడ్ ఔషధ ఎగుమతులపై 100 శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించడంతో దేశీయ మదుపరుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో ఒక దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ 733.22 పాయింట్ల నష్టంతో మూడు వారాల కనిష్ఠ స్థాయి 80,426.46 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ సైతం 236.15 పాయింట్లు కోల్పోయి 24,654.70 వద్ద నిలిచింది. ట్రంప్ దెబ్బకు ఫార్మా, ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. హెల్త్‌కేర్ ఇండెక్స్ ఏకంగా 2.14 శాతం నష్టపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోసింది.
మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 3.70 శాతం



నష్టపోయి లూజర్‌గా నిలిచింది.
దీంతోపాటు ఎటర్నల్, టాటా స్టీల్, బజా జ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయిం ట్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 2 శాతానికి పైగా నష్టపోయాయి.
హెచ్‌సీఎల్ టెక్నాలజీ, భెల్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, మారుతి షేర్లు కూడా పడిపోయాయి.
ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, ఐటీసీ, రిలయన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 2 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు 1.96 శాతం నష్టపోయాయి.
రంగాలవారీగా టెలికాం 2.69 శాతం నష్టపోగా..ఐటీ 2.43 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 2.34 శాతం, టెక్నాలజీ 2.03 శాతం, కమోడిటీస్ 1.91 శాతం, మెటల్ 1.90 శాతం, సర్వీసెస్ 1.73 శాతం వరకు పతనం చెందాయి.
గత ఆరు సెషన్లలో సెన్సెక్స్ 2,587.50 పాయింట్లు లేదా 3.11 శాతం నష్టపోగా, నిఫ్టీ 768.9 పాయింట్లు లేదా 3 శాతం పడిపోయింది.
రూ.16 లక్షల కోట్ల సంపద ఆవిరి దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలతో కొనసాగుతుండటంతో మదుపరులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గడిచిన ఆరు సెషన్లలో మదుపరులు రూ.16 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.450.85 లక్షల కోట్లకు దిగొచ్చింది. అంతకుముందు వారంలో రూ.466.89 లక్షల కోట్లుగా ఉన్నది

## వెండి వెలుగులు.. మరో రూ.1900 పెరిగిన కిలో ధర

**న్యూఢిల్లీ,**
వెండి వెలుగులు జిమ్ముతున్నది. శుక్రవారం వెండి చారిత్రక గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. కిలో వెండి ధర రూ.1,900 ఎగబాకి రూ.1,41,900 పలికింది. వెండి చరిత్రలో మునుపెన్నడు స్థాయికి ఎగబాకింది. వెండితోపాటు బంగారం పరుగులు పెట్టింది. 10 గ్రాముల పుత్తడి ధర రూ.330 ఎగబాకి రూ.1,17,700 చేరుకున్నది.ప్రస్తుత పండుగ సీజన్ కావడంతో అతి విలువైన లోహాలకు డిమాండ్ భారీగా పెరిగిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. వెండి ధరలు గురువారం తన రికార్డు స్థాయి రూ.1.40 లక్షలకు చేరుకున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర స్వల్పంగా తగ్గి 3,744.75 డాలర్లకు పడిపోగా, వెండి 45.03 డాలర్లకు పరిమితమైంది.



# స్పోర్ట్స్

## భారత్ సూపర్.. సూపర్ ఓవర్‌లో లంకపై అద్భుత విజయం

### నిస్సనక సెంచరీ వృథా
### అదరగొట్టిన అభిషేక్

**దుబాయ్**
ఆసియాకప్‌లో భారత్, శ్రీలంక సూపర్-4 పోరు అభిమానులను కట్టిపడేసింది. టీ20 మజాను అందిస్తూ ఆఖరి వరకు గెలుపు దోబూచులాడిన పోరులో టీమ్‌ఇండియాదే పైచేయి అయ్యింది. నిర్ణీత ఓవర్లలో ఇరు జట్ల స్కోర్లు(202/5) సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు జరిగిన సూపర్ ఓవర్‌లో భారత్..అద్భుత విజయం సాధించింది. మొదట లంక నాలుగు బంతుల్లో రెండు వికెట్లు(కుశాల్, శనక)కోల్పోయిన రెండు పరుగులే చేసింది. ఛేదనలో టీమ్‌ఇండియా తొలి బంతికే విజయాన్నందుకుంది. అంతకుముందు భారత్ 20 ఓవర్లలో 202/5 స్కోరు చేసింది.
ఓపెనర్ అభిషేక్‌శర్మ(31 బంతుల్లో 61, 8ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు తిలక్‌వర్మ(49 నాటౌట్), శాంసన్(39) రాణించారు. అసలంక, శనక ఒక్కో వికెట్ తీశారు. లక్ష్యఛేదనలో లంక 20 ఓవర్లలో 202/5 స్కోరు దగ్గర ఆగిపోయింది. ఓపెనర్ పతుమ్ నిస్సనక(58 బంతుల్లో 107, 7ఫోర్లు, 6 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో దుమ్మురేపాడు. నిస్సనకకు తోడు కుశాల్ పెరెరా(58) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. హార్దిక్, అర్ష్‌దీప్, కుల్దీప్, రానా ఒక్కో వికెట్ తీశారు.

**అభిషేక్ అదుర్స్:**
టీమ్‌ఇండియా యువ ఓపెనర్ అభిషేక్‌శర్మ..ఆసియాకప్‌లో సూపర్‌ఫామ్ కొనసాగిస్తున్నాడు. టాస్ గెలిచిన లంక..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. టోర్నీలో ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(4)



మరోమారు నిరాశపరిచాడు. తీక్షణ రెండో ఓవర్‌లో షాట్ ఆడబోయిన గిల్..నేరుగా అతనికే క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తుషారను లక్ష్యంగా చేసుకుంటూ మూడో ఓవర్‌లో వరుస బౌండరీలు కొట్టిన అభిషేక్..ఐదో ఓవర్‌లో చమీరాకు చుక్కలు చూపించాడు. కండ్లు చెదిరే సిక్స్‌తో మొదలుపెట్టి రెండు ఫోర్లతో దుమ్మురేపడంతో 15 పరుగులు వచ్చిపడ్డాయి. అదే దూకుడు తుషారపై కొనసాగిస్తూ రెండు ఫోర్లతో 22 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 71 పరుగులు చేసింది. మరోవైపు కెప్టెన్ సూర్యకుమార్(12) తన పేలవ ఫామ్‌ను కొనసాగించాడు. హసరంగా బౌలింగ్‌లో స్వీప్‌షాట్ ఆడబోయిన సూర్య..ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..తన జోరు తగ్గించని అభిషేక్.. అసలంక 8వ ఓవర్‌లో మెండిస్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఐదో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన శాంసన్..తిలక్‌వర్మకు జతకలిశాడు. పది ఓవర్లకు 100/3 స్కోరు చేసిన టీమ్‌ఇండియా వీరిద్దరి బ్యాటింగ్‌తో స్కోరుబోర్డు ఊపందుకుంది. ముఖ్యంగా శాంసన్ తనదైన శైలిలో బ్యాటు ఝులిపించాడు. కుదురుకున్న సమయంలో శనక..శాంసన్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ జోడీని విడగొట్టాడు. దీంతో నాలుగో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత వచ్చిన హార్దిక్‌పాండ్యా(2) శాంసన్‌ను అనుసరించాడు. ఆఖర్లో అక్షర్‌పటేల్(21 నాటౌట్)తో కలిసి తిలక్‌వర్మ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి అక్షర్ సిక్స్ కొట్టడం ద్వారా భారత్ 200 పరుగుల మార్క్ అందుకుంది.

**నిస్సనక, పెరెరా దంచుడు**
లక్ష్యఛేదనలో లంకకు ఓపెనర్ కుశాల్ మెండిస్(0) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత పతుమ్ నిస్సనక, కుశాల్ పెరెరా ఇన్నింగ్స్ నిర్మించారు. రానా మూడో ఓవర్‌లో నిస్సనక, పెరెరా చెరో బౌండరీతో దంచుడుకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత అర్ష్‌దీప్‌ను నిస్సనక ఓ ఫోర్, సిక్స్‌తో అరుసుకోగా, ఈసారి తన వంతూ అంటూ పెరెరా కూడా చెలరేగడంతో పవర్ ప్లే పూర్తయ్యే సరికి లంక 72/1 స్కోరు చేసింది. వీరిద్దరిని విడదీసేందుకు కెప్టెన్ సూర్య ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో 25 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న నిస్సనక ఏ దశలోనూ వెనుకకు తగ్గలేదు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని వరుణ్ 13వ ఓవర్‌లో విడదీయడంతో రెండో వికెట్‌కు 127 పరుగుల భారీ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. నిస్సనక 52 బంతుల్లో టీ20ల్లో తొలి సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. రానా వేసిన చివరి ఓవర్‌లో 12 పరుగులు అవసరమైన దశలో వికెట్ కోల్పోయి 11 రన్స్‌కు పరిమితమైంది.

**సంక్షిప్త స్కోర్లు**
భారత్: 20 ఓవర్లలో 202/5(అభిషేక్ 61, తిలక్ 49 నాటౌట్, అసలంక 1/18, శనక 1/23),
శ్రీలంక: 20 ఓవర్లలో 202/5(నిస్సనక 107, కుశాల్ పెరెరా 58, హార్దిక్ 1/7, కుల్దీప్ 1/31)

## రౌఫ్ మ్యాచ్ ఫీజులో కోత.. ఫర్హాన్‌కు మందలింపు




**దుబాయ్**
ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో ఇటీవల ముగిసిన సూపర్-4 మ్యాచ్‌లో అభ్యంతరకర హావభావాలతో టీమ్‌ఇండియా అభిమానులను రెచ్చగొట్టేవిధంగా ప్రవర్తించిన పాకిస్థాన్ క్రికెటర్లు హరీస్ రౌఫ్, ఫర్హాన్‌పై ఐసీసీ చర్యలకు దిగింది. రౌఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత విధించగా ఫర్హాన్‌ను మందలించి మళ్లీ ఇలాంటివి చేయరాదని వార్నింగ్ ఇచ్చింది.
బీసీసీఐ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచి రిచర్డ్‌సన్ ఎదుట విచారణకు హాజరైన రౌఫ్.. మ్యా చ్‌లో తాను చేసిన సంజ్ఞ (ఆపరేషన్ సింధూర్‌లో పాక్ సైన్యం భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్లను కూల్చిందనేదానిని ప్రతిబింబించేలా చేతి వేళ్లతో ఆరు అని చూపించడం)లు భారత్‌ను ఉద్దేశించినవికావని విచారణలో చెప్పినట్టు తెలిసింది.

**సూర్యకు జరిమానా.. బీసీసీఐ అప్పీల్**
గ్రూప్ దశలో పాకిస్థాన్‌తో మ్యాచ్ ముగిశాక టీమ్‌ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలకు గాను ఐసీసీ అతడి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది. అయితే ఐసీసీ తీర్పుపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై ఐసీసీకి అప్పీల్ చేసినట్టు సమాచారం.

## భారత్ ఏ రికార్డు విజయం.. రాహుల్, సుదర్శన్ శతక జోరు

**లక్నో:** సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (210 బంతుల్లో 176 నాటౌట్, 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ శతకానికి తోడు సాయి సుదర్శన్ (100) సెంచరీతో కదంతొక్కడంతో ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఏ' రికార్డు విజయాన్ని అందుకుంది. 413 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు గాను ఓవర్‌నైట్ స్కోరు 169/2తో నాలుగో రోజు ఆట ఆరంభించిన భారత్.. 91.3



ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది.సాయి నిష్క్రమించాక కెప్టెన్ ధ్రువ్ జురెల్ (56), నితీశ్ రెడ్డి (16లి)తో కలిసి రాహుల్ గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు. కాగా భారత్‌లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇది విజయవంతమైన ఆరో అత్యధిక ఛేధన. ఈ జాబితాలో వెస్ట్‌జోన్.. 2010 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్‌జోన్ నిర్దేశించిన 536 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడమే ఇప్పటిదాకా అత్యుత్తమంగా ఉంది. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది.



# వెంకీ సినిమా కోసం త్రివిక్రమ్ కొత్త టీమ్

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న నటుడు విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్రయూనిట్ అక్టోబర్‌లో రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. వెంకీ 77 అనే వర్కింగ్ -టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఒక విషయం వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం త్రివిక్రమ్ తన టీమ్ మొత్తాన్ని మార్చినట్లు- తెలుస్తుంది. కొత్తవారిని ఈ సినిమా కోసం తీసుకున్నట్లు- ఫిల్మ్ నగర్‌లో టాక్ నడుస్తుంది. అయితే ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అవ్వడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.





# సంక్రాంతికి రాబోతున్న నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత నవీన్ పొలిశెట్టి నటిస్తున్న తాజా చిత్రం అనగనగా ఒక రాజు. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రం తాజాగా విడుదల తేదీని ప్రకటించింది. సంక్రాంతి కానుకగా.. జనవరి 14 న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రమోషనల్ వీడియోను పంచుకుంది.

# సాయి పల్లవికి అరుదైన గౌరవం



కళారంగంలో ఆమె చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. తమిళనాడు ప్రభుత్వం 2021, 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన కళైమామణి పురస్కారాల విజేతలను ప్రకటించింది. ఇందులో భాగంగా, 2021 సంవత్సరానికి గాను నటి సాయి పల్లవికి ఈ అవార్డు లభించింది. ఆమెతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. 2023 సంవత్సరానికి గాను ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌కు లభించింది. ఇంకా దర్శకులు ఎస్.జె. సూర్య, లింగుసామి, నటులు విక్రమ్ ప్రభు, మణికందన్ వంటి వారు కూడా ఈ జాబితాలో ఉన్నారు. సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా వంటి వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన వారిని గౌరవించేందుకు తమిళనాడు ప్రభుత్వం ఏటా ఈ పురస్కారాన్ని అందిస్తుంది. తమిళనాడులోని ఉన్నత పౌర పురస్కారాలలో కళైమామణి ఒకటి. ఈ అవార్డు కింద విజేతలకు మూడు సవర్ల బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తారు. త్వరలోనే జరగనున్న ఓ కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చేతుల మీదుగా విజేతలకు ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.



# బోల్డ్ లుక్‌లో ఆలియా..

అందాల ముద్దుగుమ్మ ఆలియా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఎప్పుడూ డిఫరెంట్ లుక్‌లో దర్శనం ఇచ్చే ఈ చిన్నది తాజాగా బోల్డ్ లుక్‌లో దర్శనం ఇచ్చింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.బాలీవుడ్ ముద్దుగుమ్మ ఆలియా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ బ్యూటీ స్టార్ కిడ్‌గా బాలీవుడ్ లోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ, ప్రస్తతం స్టార్ హీరోయిన్‌గా తన సత్తా చాటుతుంది. వరసగా బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటూ, తన నటనతో ప్రతి ఒక్కరి మనసు దోచేస్తుంది.ఈ అమ్మడు హిందీలో అనేక సినిమాలు చేసింది. తర్వాత జూనియర్ ఎన్టీఆర్ సరసన ఆర్ ఆర్ ఆర్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది. ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులను అలరించినప్పటికీ, ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఆశించిన రేంజ్‌లో అవకాశాలు మాత్రం రావడం లేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా బోల్డ్ లుక్‌లో ఉన్న ఫొటోస్ షేర్ చేసింది. మిలన్ ఫ్యాషన్ వీక్‌లో బోల్డ్ లుక్‌లో షాకిచ్చింది. ఎప్పుడూ సింపుల్‌గా కనిపించే ఈ బ్యూటీ తాజాగా, బ్లాక్ కలర్ డ్రెస్‌లో తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది.అయితే టైగర్ ప్రీమియర్స్ డెమ్నా ఫ్యాషన్ కలఎక్షన్స్ ప్రమోట్‌లో భాగంగా ఈ అమ్మడు డెమ్నా బ్రాంగ్ డిజైన్ చేసిన ఫ్యాషన్ వేరి ధరించి తన అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# మూడు నిమిషాల ముప్పై సెకన్స్‌తో ప్రభాస్ మూవీ ట్రైలర్..

## ఎప్పుడు రానుంది అంటే..!




పాన్‌ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్' నుంచి ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటికే గ్లిమ్స్, టీజర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమాకు సంబంధించి ఫుల్ లెంగ్త్ ట్రైలర్‌ను అక్టోబర్ 2న విడుదల చేయబోతున్నారు. అయితే ట్రైలర్‌ను యూవీ క్రియేషన్స్ భారీగా ప్లాన్ చేస్తోంది. అదే రోజు విడుదల కాబోతున్న 'కాంతారా ఛాప్టర్ 1' సినిమాతో పాటు 'ది రాజా సాబ్' ట్రైలర్‌ను థియేటర్లలో స్క్రీన్ చేయనున్నారు. ఇప్పటికే ఈ ట్రైలర్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సుమారు 3 నిమిషాల 30 సెకన్ల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌కు యు/ఎ సర్టిఫికెట్ లభించింది.ఈసారి డైరెక్టర్ మారుతి, టీజర్‌లో చూపించిన రొమాంటిక్, కామెడీ షేడ్స్‌కి భిన్నంగా, హారర్ -యాక్షన్ ఎలిమెంట్స్‌తో కూడిన ట్రైలర్‌ను రెడీ చేశాడట.దీంతో సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచాలని చూస్తున్నారు మేకర్స్. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో వీటీవీ గణేష్, షకలక శంకర్ కనిపించనుండగా, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ విలన్‌గా తెరపై కనిపించనున్నాడు.మొదట విడుదలైన టీజర్‌లో డిసెంబర్ 5న సినిమాను రిలీజ్ చేస్తామని ప్రకటించిన చిత్ర బృందం, జనవరి 9, 2025కి చిత్రాన్ని వాయిదా వేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ట్రైలర్‌లోనే ఖచ్చితమైన రిలీజ్ డేట్‌ను వెల్లడించే అవకాశముందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ట్రైలర్ విడుదలతో సినిమాపై మిగతా అప్డేట్స్ కూడా రెగ్యులర్‌గా వస్తాయన్న అంచనాలు ఉన్నాయి. ప్రభాస్ ఫ్యాన్స్‌కు ఇది నిజంగా ఒక పెద్ద సర్‌ప్రైజ్ అని చెప్పవచ్చు. ప్రభాస్ నుంచి చాలా కాలం తర్వాత ఒక రొమాంటిక్ ఎంటర్టైనర్ గా వస్తున్న రాజా సాబ్ సినిమాపై అంచనాలు మాత్రం భారీగానే ఉన్నాయి. మారుతి కూడా మూవీపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ రేంజ్ మరింత పెరగడం ఖాయం అంటున్నారు. ఇక ప్రభాస్ నుండి త్వరలో ఫౌజీ, సలార్ 2, స్పిరిట్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇందులో కొన్ని చిత్రాలు సెట్స్ పై ఉన్నాయి. స్పిరిట్ కోసం ఫ్యాన్స్ ప్రత్యేకంగా ఎదురు చూస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492